


డిఆర్‌ఓగా సీతారామమూర్తి బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

తూర్పుగోదావరి జిల్లా రెవెన్యూ అధికారిగా తామరాల సీతారామమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1995లో ప్రొహిబిషనరీ డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీకాకుళం జిల్లా కవిటలో చేరారు. అనంతరం శ్రీకాకుళం, మచిలీపట్నం, విశాఖ జిల్లాల్లో పలు హోదాల్లో పనిచేశారు. విశాఖపట్నం ల్యాండ్ ప్రొటెక్షన్ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై తూర్పు గోదావరి జిల్లాకు డిఆర్‌ఓగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించన అనంతరం జెసిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు సిబ్బంది, అధికారులు అభినందనలు తెలిపారు.

పెళ్లిళ్లకు ధరల సెగ

- గతేడాది కంటే రెట్టింపైన ఖర్చులు
- బెంబేలెత్తుతున్న పేదలు, మధ్యతరగతి ప్రజలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పెళ్లిపై ధరల మోత మోగుతోంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో వివాహ సామగ్రికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. తమ కుటుంబంలో జరగబోయే వివాహాన్ని మధురజ్ఞాపకంగా భావించటం పరిపాటి. ఉన్నంతలో అంగరంగ వైభవంగా చేయాలని ఆరాటపడతారు. అయితే ప్రస్తుతం పెళ్లిళ్లకు ధరల సెగ తగులుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసరాల వస్తువుల నుంచి, కల్యాణ మండపాలు, బ్యాండు మేళాలు, డెకరేషన్ సామగ్రి.. ఇలా అన్నింటా ధరలు రెట్టింపయ్యాయి. అంచనాలకు మించి ఖర్చులు పెరిగిపోవడంతో నిర్వాహకులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం ప్రారంభమైన పెళ్లిళ్ల సీజన్ వచ్చేనెల 21 వరకు కొనసాగనుంది. జిల్లాలో ఈ నెలన్నర వ్యవధిలో సుమారు 10వేల వివాహాలు జరుగనున్నట్టు అంచనా. ఉమ్మడి జిల్లాలో సుమారు 600లకు పైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. ఒక్కో కల్యాణ మండపానికి రోజుకు రూ.50వేల నుంచి రూ.2లక్షలు వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు.



దుస్తులు, ఇతర కానుకలపై ధరాభారం

పెండ్లికుమార్తె, కుమారుడితో సహ తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యుల దుస్తుల నిమిత్తం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. కొంతకాలంగా వస్త్రాలపై జీఎస్‌టీ కూడా విధిస్తుండటంతో ధరలు మరికాస్త పెరిగిపోయాయి. వివాహంలో కేవలం వస్త్రాలకే రూ.2 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఖర్చువుతోంది. గతేడాది ఇదే సమయంలో రూ.1.50 లక్షలకు దుస్తులకు ఖర్చు అయ్యేది. వివాహ సమయంలో బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి తీసుకోవటం ఆనవాయితీ. సామాన్య మధ్యతరగతి ఇళ్లలోనే వీటన్నింటి ఖర్చు గతంలో సుమారుగా రూ.3 లక్షలు ఉండేది. ఇప్పుడు రూ.ఆరేడు లక్షలు దాటిపోతోంది. బంగార తులం ధర రూ.70వేలు దాటిపోవటంతో ఖర్చు రెట్టింపు అయ్యింది.

నింగిని తాకుతున్న నిత్యావసరాలు

పప్పు దినుసులు, ఇతర నిత్యావసరాల ధరల పెరుగుదలతోపెళ్లిళ్ల నిర్వాహకులు బెంబేలెత్తి పోతున్నారు. వంటనూనెల ధరలు, ఇతర సరుకుల ధరలు అధికమవటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో రూ.1800 ఉండే వాణిజ్య గ్యాస్ సిలండర్ ధర రూ.2,400 చేరిన విషయం విధితమే. టమాట, కూరగాయాలు, కిరాణా సామగ్రి ధరలు అధికంగా ఉన్నాయి. ంధువులు, స్నేహితులకు రవాణా సదుపాయాల కల్పించేందుకు రూ. వేలల్లో ఖర్చు అవుతోంది. పెట్రోల్ డీజిల్ ధరలు, వాహనాల వార్షిక పన్నులు పెరగటంతో కార్లు, బస్సుల అద్దెలు 25 శాతం వరకూ పరిగాయి. దీంతో ప్రయాణ ఖర్చులకు సుమారు రూ.50వేలు వరకు ఖర్చవుతోంది. పూల ఖర్చులూ అదే బాటలో ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావటంతో ప్రస్తుతం మార్కెట్లో కిలో మల్లెలు రూ.500వరకు పలుకుతున్నాయి. కనకాంబరాలు రూ.600 పైమాటే.. వేదిక పూల అలంకరణ నిమిత్తం రూ.లక్షకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కుటుంబసభ్యుల అవసరాల నిమిత్తం తక్కువలో తక్కువగా రూ.30వేలు అయినా ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది. మొత్తం మీద తాజా పరిస్థితులలో పెళ్లి ఖర్చులు ధరల పెరుగుదల మధ్యతరగతివారికి, పేదలకు ఇబ్బందిగా మారింది. ఆడంబరాల సంగతి ఎలా ఉన్నా సాధారణ ఖర్చులే తడిసిపమోపడవుతున్నాయని వధూ, వరుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

రూ.15లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చింది

ఈ నెలలో మొదటి వారంలో మా అబ్బాయికి వివాహం చేశాను. కల్యాణ మంటపానికి అద్దె రూ.80వేలు చెల్లించాను. డెకరేషన్, ఎసి ఖర్చులు ఇక సరేసరి. మొత్తం మీద రూ.2 లక్షలుపై మాటే. 20 సంవత్సరాలుగా వ్యాపార రంగంలో ఉన్నాను. మా ఇంటిలో జరిగిన మొదటి శుభకార్యం కావడంతో బంధువులు, స్నేహితులు అందరినీ ఆహ్వానించాము. భోజనాలు, కానుకలు ఇతరాత్ర ఖర్చులు కలిపితే మొత్తం రూ.15 లక్షల వరకూ వెచ్చించాల్సి వచ్చింది.

- కె. రాము. ఆర్యాపురం, రాజమహేంద్రవరం

ఆర్భాటం లేకున్నా రూ.5లక్షలు ఖర్చు

ఇటీవల కుమార్తె వివాహం జరిపించాను. చిరువ్యాపారమే మాకు జీవనోపాధి. వరుడు సమీప బంధువే, ఇరు కుటుంబాలు తక్కువ ఖర్చులో పెళ్లి చేయాలని నిశ్చయించు కున్నాము. ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా కొద్దిమంది బంధు వులు, స్నేహితులతో నిరాడంబరంగా వివాహం జరిపించాను. దుస్తులు, భోజనాలు, ఇతర ప్రయాణ ఖర్చులు వెరసి సుమారు రూ.5లక్షల వరకూ ఖర్చు అయింది. ప్రస్తుతం అన్ని ధరలూ పెరగటమే కారణం.

- కె. శ్యామ్ సీతంపేట రాజమహేంద్రవరం

ఖర్చులు పెరిగాయి ఇలా...

	గతేడాది	ప్రస్తుతం
1. కళ్యాణ మండపం	రూ.50వేలు-రూ.లక్ష	రూ.50వేలు-రూ.2లక్షలు
2. దుస్తులు	రూ.1.50 లక్షలు	రూ.2 లక్షల - 3లక్షలు
3. ఆభరణాలు	రూ.2 లక్షలు	రూ.2 లక్షల - 3లక్షలు
4. టెంటు, ఇతర సామగ్రి	రూ.30వేలు	రూ.80వేలు
5. రవాణా ఖర్చులు	రూ.25వేలు	రూ.50వేలు
6. విందు	రూ.లక్ష	రూ.2.5 లక్షలు
7. వినోదం	రూ.2లక్షలు	రూ.3లక్షలు



సమావేశంలో మాట్లాడుతున్నఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి

సమస్యలపై రాజీలేని పోరాటం : గోపిమూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానని పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గోపిమూర్తి పరిచయ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిరకాలంగా మున్సిపల్ కార్పొరేషన్లలో ఉపాధ్యాయుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయుల కొరత వల్ల మున్సిపల్ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. యుటిఎఫ్ మండల, జిల్లా స్థాయిల్లో చేసిన పోరాటాలు ఫలితంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తు చేశారు. త్వరలోనే మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పిఎఫ్, పోస్టుల అప్‌గ్రేడేషన్ తదితర సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థి సంఘ నాయకునిగా, యుటిఎఫ్ రాష్ట్ర నాయకునిగా విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పలు ఉద్యమాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనకు అందరి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్‌రావు, జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు, నగర అధ్యక్షుడు జెవివి.సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షులు ఎం.నరేష్, బి.ఆంజనేయులు, ఎన్.నాగేశ్వరరావు, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో సిహెచ్‌సి నిర్మాణం : ఎంఎల్‌ఎ మద్దిపాటి

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థానంలో పెద్దాసుపత్రిని నిర్మించబోతున్నామని గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. నల్లజర్లకు 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం మంజూరు చేసిన నేపథ్యంలో సోమవారం పిహెచ్‌సిని ఎంఎల్‌ఎ పరిశీలించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునేవిధంగా ప్రజారోగ్య పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే సిహెచ్‌సి నిర్మాణానికి అనుమతి వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పిహెచ్‌సి ఆవరణలో ప్రధాన రహదారిని ఆనుకుని కొత్త ఆసుపత్రి భవన నిర్మాణం జరగాలని భావిస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన స్థల సేకరణకు సహకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ పద్మశ్రీ మాట్లాడుతూ నల్లజర్లలో సిహెచ్‌సి నిర్మాణానికి అవసరమైన వనరులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. వారి వెంట టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, నాయకులు రావూరి వెంకటరమణ, యలమాటి శ్రీనివాసరావు, తహశీల్దార్ వల్లూరి శాంతిప్రియ, ఎంపిడిఒ సింహాద్రిరావు, వైద్యాధికారులు తెల్లం గంగాధరరావు, మహ్మద్ సిరాజుద్దీన్, సిహెచ్‌ఒ పలివెల ప్రసాదరావు, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జివివి.ప్రసాద్ ఉన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు 135 అర్జీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌కు 135 అర్జీలు వచ్చాయని జెసి ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ అర్జీలను సకాలంలో పరిష్కరించాని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పిజిఆర్‌ఎస్ కార్యక్రమం ఉండాలన్నారు. ఫిర్యాదుదారులు విజ్ఞప్తులను అధికారులు క్షుణంగా పరిశీలించి రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుంటే చర్యలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అనుమతులు లేకుండా బాణసంచా తయారీ, విక్రయాలపై చర్యలు తప్పవని ఎస్ఐ జి.శ్రీనివాసరావు హెచ్చరించారు. బాణసంచా విక్రయదారులు పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు సూచించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. పోలీసులు సూచించిన ప్రాంతాల్లోనే బాణసంచా విక్రయాలు జరపాలన్నారు. వ్యాపారుకు పలు సూచనలు చేశారు. వారు ఏర్పాటు చేసుకుంటున్న దుకాణాల ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు.

చాగల్లు : దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయదారులతో సోమవారం చాగల్లు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.నరేంద్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షాపులు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా షాపుల వద్ద సేఫ్టీ ప్రికాషన్స్ కచ్చితంగా పాటించాలన్నారు.

విద్యా, వసతి దీవెన నిధులను విడుదల చేయాలి

ప్రజాశక్తి - నిడదవోలు

విద్యా, వసతి దీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్ మాట్లాడారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలన్నారు. నిడదవోలులో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం విద్యాదీవెన, వసతిదీవన నిధులు రూ.3,480 కోట్లను పెండింగ్‌లో పెట్టిందన్నారు. దీని వల్ల విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతి ఇస్తామంటూ విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయన్నారు. కావున తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేయాలన్నారు. జిఒ 77 వల్ల పీజీ చదువులకు విద్యార్థులు దూరం అవుతున్నారనానరు. దీన్ని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. హాస్టళ్ల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతుందని, సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అన్నా క్యాంటీన్లకు ప్రభుత్వం రూ.96 కేటాయిస్తుందని, కాని హాస్టల్ విద్యార్థులకు కళాశాల విద్యార్థికి రూ.53, పాఠశాల విద్యార్థికి రూ.46 మాత్రమే ఇస్తున్నారన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ బిల్లు పెంచాలన్నారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేని పక్షాన ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, మణికంఠ, నరేష్, దినేష్, ఆజాద్, ఆనంద్, వీరేంద్ర, అబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ

త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తాం

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భారతి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ బత్తుల ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఉచిత ఇసుక విధానంలో ఎటువంటి జాప్యాలు, అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించినట్టు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎన్‌డిఎ ప్రభుత్వం ఎన్నికల హామీలకు కట్టుబడి ఉందని సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సోమవారం హోటల్ జగదీశ్వరిలో కూటమి నాయకులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసిపి సర్కారు రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పుల భారాన్ని మిగిల్చిందన్నారు. గత పాలనలో అప్పుల భారం తప్పితే రాష్ట్రాభివృద్ధి శూన్యమన్నారు. సూర్యుడు పొద్దు పొడవ ముందే పింఛన్లను అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. దీపావళి సందర్భంగా ఉచిత గ్యాస్ సిలెండర్లను అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తెల్ల కార్డు, ఆధార్ కార్డు ఉన్నవారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ నెల 29 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. అక్టోబర్ 31 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం కానుందన్నారు. ఇంటికి గ్యాస్ సిలెండర్ వచ్చిన తరువాత యథావిధిగా డబ్బులు చెల్లించిన రెండు రోజుల్లో అర్హుల ఖాతాల్లోకి సబ్సిడీ సొమ్ము జమ అవుతుందన్నారు. అక్టోబర్ 31 నుంచి మార్చి నెలాఖరులోగా ఒక సిలిండర్, 2025 ఏప్రిల్ 1 నుంచి జులై వరకూ రెండో సిలిండర్, జులై నుంచి నవంబర్ వరకూ మూడో సిలిండర్ ఉచితంగా అందిస్తామన్నారు. ఇందులో ఏమైనా సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేయాలన్నారు. సోలార్ పవర్‌ను అభివృద్ధి చేసుకోవడంతో కరెంట్ ఛార్జీలు అదుపులోకి వస్తాయన్నారు. ఈ నెల 26న నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. సుమారు 10 వేల మంది హాజరయ్యారు. ఈ సమావేశంలో కాశి నవీన్‌ుమార్, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, తవ్వా రాజా తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

రహదారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కె.సావరం పంచాయతీ పరిధిలోని అయ్యప్ప నగర్, టీచర్స్ కాలనీల ప్రధాన రహదారి సమస్య సర్పంచ్ నార్ని రామకృష్ణ చొరవతో తీరిందని ఆయా కాలనీవాసులు తోట మల్లేశ్వరరావు, జవ్వాది సుబ్బారావు, పార్థసారథి, రాపాక రాజు, ఎస్ నాగేంద్ర రెడ్డి తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. కాలనీలు ఏర్పడిన నాటి నుంచి రహదారి లేక నానా ఇబ్బందులు పడ్డామన్నారు. సర్పంచ్ చొరవతో ఏర్పాటు చేసిన రహదారుల వల్ల తమ సమస్య తీరుతుందన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఎవరూ ఈ రహదారుల సమస్య పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే పల్లె సీమల పట్ల, గ్రామీణ రహదారుల పట్ల శ్రద్ధ తో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సహకారంతో రూ.39 లక్షల ఉపాధి నిధులతో 600 మీటర్ల సిసి రోడ్ల నిర్మాణాన్ని పది రోజుల్లోనే పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధినాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రోడ్ల ప్రారంభోత్సవానికి మంత్రి దుర్గేష్‌ను తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందితో విజిలెన్స్ అవేర్నెస్ ప్రతిజ్ఞ నిర్వహించారు. అన్ని రంగాల్లో చట్ట నియమాలను అనుసరించాలని, లంచం తీసుకోకుండా, ఇవ్వకుండా ఉండాలని, ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని, వ్యక్తిగత ప్రవర్తనలో సమగ్రతను ప్రదర్శించాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలలో భాగంగా ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివివి.రామారావు, ఇఒపిఆర్‌డి ఆంజనేయశర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ దుర్గాభవాని, డిటి ఎ.కనకదుర్గ పాల్గొన్నారు.

తాళ్లపూడి : తమ ఉద్యోగ రీత్యా విధుల ప్రకారం ప్రజలకు సేవలు అందిస్తూ అవినీతికి లంచాలకు దూరంగా ఉంటామని మండల పరిషత్ ఉద్యోగులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఎంపిడిఒ రమణ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఈ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి వీరన్న, ఎపిఒ రమాదేవి, ఎంపిడిఒ కార్యాలయ సూపరింటెండెంట్ నిర్మల, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభకు ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి- కడియం

రైతుల భూ సమస్యల పరిష్కారానికి మండలంలోని జేగురుపాడులో సోమవారం నిర్వహించిన గ్రామ సభకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గతంలో చేసిన భూ సర్వేలో భూముల వివరాలు తప్పుగా నమోదయ్యాయని దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని పలువురు రైతులు వాపోయారు. సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డిప్యూటీ తహశీల్దార్ మహాలక్ష్మి పాల్గొన్నారు. ఫిర్యాదులను స్వీకరించారు. పడాల చెరువును స్థానిక ఫిషర్ మెన్ కోపరేటివ్ సొసైటీ లీజుకు తీసుకుని చేపలు పెంపకం చేపడుతుందని, నాలుగు దశాబ్దాలుగా చెరువును ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారని దీనిపై ప్రశ్నిస్తుంటే ఎదురు తిరుగుతున్నారంటూ సొసైటీ అధ్యక్షులు ఎస్.కిరణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై సర్వే చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్టాలిన్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లోపాలను సరిచేయాలన్నారు. ఈ సదస్సులో ఎంపిటిసి సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, విఆర్‌ఒ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు ఫిర్యాదులు అందిస్తున్న రైతులు

కార్టూ'నిజం'



నాలుగు శాఖల అధికారులతో విచారణ కమిటీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సంక్షేమ పథకాల పేరుతో గత వైసిపి ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు, కొందరు ప్రభుత్వ అధికారులు ఏకమై, ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతూ, సామాన్య ప్రజల సొమ్మును దోచుకున్న ఘటనపై ప్రభుత్వం కదిలింది. నాలుగు డిపార్ట్‌మెంట్ల అధికారులతో విచారణ కమిటీని వేశారని 'స్వతంత్ర జనతా పార్టీ(రిపబ్లిక్)' ఛీఫ్ బర్రే ఆనంద్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చిందని తెలిపారు. గత నెలలో తాను చేసిన ఫిర్యాదుకు సంబంధించిన వివరాలపై చర్చించారన్నారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌ని సంప్రదించాలని తెలిపారన్నారు. తరువాత రెండు రోజుల్లోనే తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి లేఖ వచ్చిందన్నారు. అందులో నాలుగు డిపార్ట్‌మెంట్ల అధికారులతో తమ ఫిర్యాదుపై విచారణ కమిటీని వేసినట్టు పేర్కొన్నారన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. రెవెన్యూ శాఖ నుంచి రాజమండ్రి ఆర్‌డిఒ, పంచాయతీ శాఖ నుంచి డిపిఒ, ఇరిగేషన్ శాఖ నుంచి ఎస్ఇ, మైన్స్ అండ్ జియాలజీ శాఖ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ఈ విచారణ కమిటీలో ఉన్నారన్నారు. వీరంతా ఫిర్యాదు అంశాలపై తనిఖీలు నిర్వహించి, విచారణ జరిపి నివేదికను అందిస్తారన్నారు. గత కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్‌భరత్, రాజానగరం మాజీ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, రాజానగరం పూర్వ కలెక్టర్ సీతాపవన్‌కుమార్ ఈ అక్రమాలు పాల్పడ్డారన్నారు. విచారణ కమిటీ సరైన నివేదికను అందిస్తే వీరు జైలుకు వెళ్లడం తప్పదన్నారు. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకుంటే ఇవే ఆధారాలతో హైకోర్టు, లోకాయుక్తలను ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్సాకోటి శ్రీను, కొత్తపల్లి మహేష్‌కుమార్, కాకి హనుమంతరావు, మార్టిన్, కొత్తపల్లి వెంకట్రావు, ఇజ్జిన రాంబాబు, దేగపాటి ప్రశాంత్‌కుమార్, సైనం ప్రసాద్, బందిలి దుర్గా ప్రసాద్, ఇజ్జిన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.



రైల్వే బాక్స్‌బాయ్స్‌ను తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో 25 ఏళ్లుగా బాక్స్ బాయ్స్‌గా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని, తొలగించిన వారికి రైల్వేలో పని కల్పించాలంటూ రాజమండ్రి రైల్వే స్టేషన్ మేనేజర్ రంగనాథన్‌కు రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఫెడరేషన్ యూనియన్ జిల్లా కార్యదర్శి బివిఎన్.పూర్ణిమరాజు వినతి పత్రం అందజేశారు. ఆగస్టు 31న బాక్స్ బాయ్స్‌ను తొలగించారన్నారు. దీంతో వారి కుటుంబాలను వీధిన పడ్డాయన్నారు. ఉపాధి లేక రెండు నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. వెంటనే రైల్వేలో పని కల్పించాలని లేదా నష్టపరిహారం ఇప్పించాలన్నారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగాగా బాక్స్ బాయ్స్‌ను కలుపుకుని ఉద్యమిస్తామన్నారు. దీనికి స్టేషన్ మాష్టర్ సానుకూలంగా స్పందించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ బాక్స్ బాయ్స్ యూనియన్ కార్యదర్శి యర్రబాలెం సత్తిబాబు, సత్యాల సుదర్శనరావు, ఉప్పాటి నాగేశ్వర రావు, సోమరాజు, కె.సురేష్, సిహెచ్.కృష్ణ.తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలో చింతలూరు గ్రామంలో 2014 డిసెంబర్ 29వ తేదీన భార్యా భర్తల మధ్య ఉన్న గొడవలు నేపథ్యంలో కూనిశెట్టి అప్పారావు తన భార్య సుజాతను మెడకు చున్ని బిగించి హత్య చేశాడు. అప్పట్లో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సిఐ జి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదోపవాదనలు విన్న పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.చంద్రమౌళి సోమవారం ముద్దాయికి జీవిత ఖైదు శిక్షతోపాటు మరో మూడేళు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. రూ.1000 చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష విధించినట్లు ప్రత్తిపాడు సిఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.మృత్యుంజయరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం ఆర్‌టిసి డిపోలో డ్రైవర్‌గా పనిచేసి అనారోగ్యంతో పదవీ విరమణ పొందిన లింగంపర్తి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎల్‌వివి.సత్యనారాయణ ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 4 సంవత్సరాల కితం పదవీ విరమణ పొందిన సత్యనారాయణకు సంస్థ నుంచి రావలసిన డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలోనే సత్యనారాయణ ఆదివారం గడ్డి మందు తాగాడన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సత్యనారాయణ మృతి చెందాడని ఆయన తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి - గండేపల్లి

మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు అదుపుతప్పి గండేపల్లి గ్రామంలో జాతీయ రహదారి డివైడర్‌ను ఢీకొంది. సినీ ఫక్కీలో డివైడర్‌ను ఢీకొన్న కారు గాల్లోకి ఎగిరి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తల్లీ, కొడుకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శివనాగు సంఘటన స్థలానికి చేరుకుని హైవే మొబైల్ వాహనంలో గాయపడిన వారిని జగ్గంపేట ఆసుపత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని జి.మేడపాడు గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 21 మందిని అదుపులోకి తీసుకుని రూ.84,200 నగదును, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దాడుల్లో సామర్లకోట సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. అరెస్టు చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తుని రూరల్ ఎస్ఐ బి.కృష్ణమాచారి తెలిపారు. తుని రూరల్ మరువాడ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొంకిపూడి వీరబాబు తన బ్యాగులో 10 లీటర్లు నాటు సారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

88 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పిఠాపురం

రూ.1.76 లక్షల విలువ చేసే 88 కేజీల గంజాయిని సోమవారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు ఆటో, బైక్‌ను సీజ్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ముందస్తు సమాచారంతో రాపర్తి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాపర్తి గ్రామం వైపు నుంచి పల్సర్ మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి పైలట్‌గా వ్యవహరిస్తూ వస్తుండగా వెనకాల పాసింజర్ ఆటోలో గంజాయి మూటలతో రావడాన్ని గమనించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పారిపోయేందుకు ప్రయత్నించిన ఎం.మణికంఠరాజు, జి.మునిరాజు, కె.రాము, ఎం.సన్యాసి రాజు అనే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 88 కేజీల గంజాయిని, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు గజాయి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి నర్సీపట్నం, రౌతులపూడి, పిఠాపురం మీదుగా కాకినాడకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నరన్నారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి కిర్లంపూడి మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన ఎం.మణికంఠరాజు 2016 సంవత్సరంలో సెంట్రింగ్ పనుల నిమిత్తం చింతపల్లి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో పనిచేస్తూ ఉన్న సమయంలో అక్కడ గంజాయి అమ్మేవారితో పరిచయాలు చేసుకుని అక్కడి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చుట్టుప్రక్కల ప్రాంతాలలో అమ్ముతూ వ్యాపారం నిర్వహిస్తుండేవాడన్నారు. సదరు వ్యక్తి పై సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్, గాజువాక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు ఉన్నాయన్నారు. ఆరెస్టు చేసిన నలుగురిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

ఎటిఎం చోరీ కేసులో నాలుగేళ్ల జైలు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక చర్చ్ సెంటర్ సమీపంలో ఉన్న డిసిసి బ్యాంకు ఎటిఎం ను ధ్వంసం చేసి చోరీకి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం జేఎఫ్ సిఎం కోర్ట్ న్యాయమూర్తి ఎం.విజయ రామేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. సెల్ఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన ఎటిఎంను బద్దలు కొట్టి రూ.1100 చోరీ చేసినట్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన అధికారులు అప్పట్లో పట్టణానికి చెందిన పి.సూరిబాబును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి దర్యాప్తు పూర్తిచేసి ఛార్జిషీటు దాఖలు చేశారని, ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ తరపున ఆకుల లీల నాగరోజా వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు, జరిమానా విధించారు.

రైతుల సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

రైతుల భూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తహశీల్దారు టి.రాజేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని మెర్లపాలెంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పాల్గొని రైతుల నుండి తమ భూమి సమస్యలు తీర్చాలని 50 అర్జీలను స్వీకరించారు. 15 రోజుల్లో రైతుల సమస్యలు పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాను, మరియు సిబ్బంది పాల్గొన్నారు.



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి

సర్పంచ్ కుటుంబానికి జగ్గిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

పెదపళ్ల సర్పంచ్ ఏడిద సత్య శ్రీమెహర్ ప్రసాద్ మరిది ఏడిద రవికుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి వైసిపి పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట కర్రి నాగిరెడ్డి, తమ్మన శ్రీనువాసు, నామాల శ్రీను, గంటా శ్రీను (ల్యాబ్), వెంకన్న, రవిరాజ్, సుబ్బారావు ఉన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయలక్ష్మి

62 'ఉపాధి' పనుల గుర్తింపు

ప్రజాశక్తి - అల్లవరం

బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. పంచాయితీ పరిధిలో 62 పనులను రూ.కోటి ఇరవై లక్షలతో చేయనున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి దుర్గా శ్రీను, పాలకవర్గ సభ్యులు అడపా శ్రీనివాసరావు, ఐల నాగేశ్వరరావు, మోసిగంటి పద్మ, మండల తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన గర్భిణి ఉమా మహేశ్వరి ప్రసవ నొప్పులు అధికం కావడంతో 108 అంబులెన్సు ఫోన్ చేశారు. ఆత్రేయపురం 108 సిబ్బంది హుటాహుటిన వెలిచేరు చేరుకుని రాజమహేంద్రవరం హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు అధికం కావడంతో అంబులెన్సులోనే ఆడబిడ్డను ప్రసవించింది. తలీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. వారిని వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం హాస్పిటల్‌కు తరలించారు.

30న అమలాపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ప్రముఖ ప్రయివేటు కంపెనీలలో పని చేసేందుకు ఈ నెల 30న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరవ్వాలని తెలిపారు. సహాయం కోసం 8121838392 నెంబరులో సంప్రదించాలి.

స్త్రీనిధి సొమ్ము గల్లంతుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం పాలగుమ్మిలో డ్వాక్రా సంఘ గ్రూపులకు సంబంధించి నగదు దుర్వినియోగంపై సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో సర్పంచ్ కుడిపూడి రామలక్ష్మి ఆధ్వర్యాన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగదు గల్లంతు సంఘటనపై సమగ్ర విచారణ చేసి డ్వాక్రా మహిళా సభ్యులకు తగు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పాలగుమ్మి విజయ, ఉప సర్పంచ్ వసంత్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో స్వామిని ఊరేగిస్తున్న అర్చకులు, సిబ్బంది, యాత్రికులు

8వ రోజు ఘనంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు 8వ రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితులు ఖండవల్లి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు యాత్రికులు క్యూ కట్టారు. దీంతో ఆలయ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. వెంకటేశ్వర స్వామి కల్పవృక్ష వాహనంపై విహరించారు. ఆలయ డిసి నల్లం చక్రధర రావు దంపతులు, లొల్ల గ్రామ సర్పంచ్ కాయలు జగన్నాథం దంపతులు, ముదునూరి వెంకటరాజు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర స్వామి కల్కి అలంకరణలో అశ్వవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

యు.కొత్తపల్లి : పొన్నాడ పంచాయతీ పరిధిలో ఉన్న పల్లిపేట సమీపంలోని వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటేష్ సోమవారం తెలిపారు. ఉప్పుటేరు వాగులో కొట్టుకు వెళ్తున్న మృతదేహాన్ని అక్కడి స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికి తీసి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించినట్లు ఆయన తెలిపారు. మృతుని ఒంటిమీద పసుపు, నలుపు గల గడిల చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. చేతికి స్టీల్ కడియం ఉన్నట్లు తెలిపారు.

బాణసంచా సామగ్రి స్వాధీనం

రాజానగరం : రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరులో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2లక్షల విలువైన బాణసంచా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు బాణసంచా సామగ్రిని ఇళ్ల మధ్య నిల్వ ఉంచినట్టు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సోదాలు నిర్వహించగా నిల్వ ఉంచిన బాణసంచాను సాధీనం చేసుకుని భద్రపరిచి యజమానికి నోటీసు ఇచ్చామన్నారు.

రోడ్లను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు



రోడ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

2027లో జరిగే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని రోడ్లను విశాలంగా తీర్చిదిద్దడానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేయాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. సోమవారం నగరంలోని కోరుకొండ రోడ్డు, తూర్పు రైల్వే స్టేషన్ రోడ్డులను ఆయన పరిశీలించారు. రాబోయే పుష్కరాలకు పెద్ద ఎత్తున యాత్రికులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రోడ్లను వెడల్పు చేయాల్సి ఉందన్నారు. దీని కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నగరంలోని కోరుకొండ రోడ్డును గతంలో కొంతమేర వెడల్పు చేసినప్పటికీ 100 అడుగుల వరకు విస్తరించాల్సి ఉందని తెలిపారు. ఈ పుష్కరాలకు రైల్వే స్టేషను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయన్నారు. రాజమండ్రి రైల్వే స్టేషను తూర్పు వైపున కూడా నూతన ప్లాట్ ఫారాలు వచ్చే అవకాశమున్నందున, మోరంపూడి రోడ్డు నుంచి బాలాజీపేటకు వెళ్ళే రోడ్డునకు ప్రాధాన్యత సంతరించు కుంటుందన్నారు. ఆ రోడ్డును 80 అడుగులు రోడ్డుగా వెడల్పు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానరు సత్యనారాయణ రాజు, అసిస్టెంట్ సిటీ ప్లానరు అనితా జూలీ, కె.శ్రీనివాసరావు, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నచ్చిన మిల్లులో ధాన్యం అమ్ముకోవచ్చు

ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాళ్లపూడి

పండించిన ధాన్యాన్ని నచ్చిన మిల్లులకు అమ్ముకోవచ్చని అలా అమ్మిన ధాన్యానికి 48 గంటల్లోగా డబ్బులు బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. మలకపల్లి గ్రామంలోని సహకార బ్యాంకులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాత్రి సర్పంచ్ రాపాక రాజేశ్వరితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం 2014-19 మాదిరిగానే రైతుల అభివృద్ధి సంక్షేమం కోసం ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుందన్నారు. రైతులకు సంబంధించిన పుంత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెసి రాముడు, జెడి ఎస్. మాధవరావు, ఎడిఎ చంద్రశేఖర్, ఎఒ రుచిత, ఎంపిడిఒ రమణ, తహశీల్దార్ రవీంద్రనాథ్, సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ నాయకులు కంఠమణి రామకృష్ణ, ఉప సర్పంచ్ రామారావు, నాయకులు మద్దిపాటి ప్రకాశం, సోమ సుందరం, ముత్యాలరావు, సత్తిబాబు, జగన్, వినోద్, వీర్రాజు, జాన్ తదితరులు ఉన్నారు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం

తాళ్లపూడి : గుండె, కిడ్నీలు చెడిపోవడంతో కొంతకాలంగా మంచానికే పరిమితమై వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రక్కిలంక గ్రామానికి చెందిన ఖండవల్లి కొండబాబుకు మండల మానవతా శాఖ రూ.6వేల ఆర్థిక సాయాన్ని అందించింది. అలాగే మానవతా సభ్యులు వీరమల్లు సూర్యనారాయణ, ఎస్.శ్రీనివాస్, వాసిపోయిన చంద్రయ్య, తెలుగు ఆంజనేయులు మరో రూ.3వేల సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా అధ్యక్షులు అంకెం సురేష్, సనపల రాజశేఖర్, అప్పన హనుమంతు, జోడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాణసంచా షాపుల ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి- గోకవరం

గోకవరంలో బాణసంచా దుకాణాల ప్రాంతాన్ని తహశీల్దార్ సాయిప్రసాద్, ఎస్ఐ పవన్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని షాపు యజమానులకు సూచించారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణం

ప్రజాశక్తి-కొత్తపేట

రక్తదానం చేస్తే మరో మనిషికి ప్రాణం పోసినట్లేనని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను కొనియాడారు. మన భద్రత, రక్షణ కోసం రోజంతా శ్రమించే పోలీసులకు, సిబ్బందికి ప్రజలంతా సహకరించడమే కాక వారికి తగు గౌరవం ఇవ్వాలని సూచించారు. డిఎస్‌పి గోవిందరావు, సిఐ విద్యాసాగర్, ఎస్ఐ సురేంద్ర, డాక్టర్ జి.దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, మాజీ జెడ్‌పిఇసి సభ్యులు ధరణాల రామకృష్ణ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కంఠంశెట్టి చంటి, మిద్దే ఆదినారాయణ, చోడపనీడి భాస్కరరావు, మాజీ సర్పంచ్ రెడ్డి తాతాజీ, బీర ఇసాక్, దూనబోయిన ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సాయం

ప్రజాశక్తి-రాజోలు

మలికిపురం మండలం పడమటిపాలెంకు చెందిన గోకనబోయిన దుర్గారావుకు ఇంటి నిర్మాణానికి ఎన్ఆర్ఐ గ్రూపు గ్రూపు సభ్యులు సాయం అందించారు. స్థానిక పెద్దల ద్వారా సోమవారం రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని అన్నాయిపేటలో మహిళలకు తడి చెత్త పొడి చెత్త సేకరణపై సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు ఆధ్వర్యాన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రత గురించి, ఇంటి శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ వైస్ ఎంపిపి శాఖ బాబి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్బారావుకు ఎంఎల్ఎ బండారు అభినందన

ప్రజాశక్తి-కొత్తపేట

కవి, అధ్యాపకుడు డాక్టర్ వివివిఎస్.సుబ్బారావు ప్రపంచ కవితోత్సవంలో నాలుగు రికార్డులు సాధించడం అభినందనీయమని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెంలో ప్రపంచ తెలుగు సాహితి కళా జాతరలో డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు. ఆయన రాసిన పండుటాకుల వ్యథ పద్య కవిత గానం, సత్యహరిశ్చంద్ర నాటకంలోని హరిశ్చంద్రుని ఏకపాత్రాభినయంతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. దీంతో సుబ్బారావును ఘనంగా సత్కరించారు. సుబ్బారావు మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించడం ద్వారా నియోజకవర్గానికి మంచి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. టిడిపి మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, గుబ్బల మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.



సుబ్బారావును అభినందిస్తున్న ఎంఎల్ఎ బండారు

అథ్లెటిక్ పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి - అంబాజీపేట

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం కె.సూర్య కనకదుర్గ, పీడి అందే సూర్యనారాయణ తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 14 విభాగంలో కొప్పిశెట్టి మనోజ్ 400 మీటర్ల పరుగుల పోటీలలో ద్వితీయ స్థానం, 600 మీటర్ల పరుగులో తృతీయ స్థానం, డొల్లా విహాన్ లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు తృతీయ స్థానం, అండర్-1 విభాగంలో చీరవరపు జయశ్రీ మూడు కిలోమీటర్లు పరుగు ప్రథమ స్థానం 1500 మీటర్ల పరుగు పోటీలలో తృతీయ స్థానం, సిహెచ్.హర్షవర్ధిని మూడు కిలోమీటర్ల పరుగు పోటీల్లో ద్వితీయ స్థానాల్లో జిల్లా పోటీలకు ఎంపికై నారన్నారు. వారిని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్ఎంసి చైర్ పర్సన్ నూకల రత్నమాల, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, ఎంఇఒలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, స్టాఫ్ సెక్రటరీ టి.శివకుమార్, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, తదితరులు వారిని అభినందించారు.



పోటీలకు ఎంపికైన పుల్లేటికుర్రు విద్యార్థులు

ప్రజా సమస్యలపై వినతి

రాజోలు : మలికిపురం మండల పరిషత్ కార్యాలంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలు ప్రజా సమస్యలపై రాజోలు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మలికిపురం ఎంపిడిఒ ఎన్.బాలాజీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాజోలు పరిరక్షణ సమితి అధ్యక్షుడు నల్లి ప్రసాదరావు, ఉపాధ్యక్షులు కుడుపూడి శివమణి, కార్యదర్శి మంద సత్యనారాయణ, సభ్యులు బూసి జాన్ మోషే, ముత్యాల శ్రీనివాస్ రావు, గెడ్డం బాలరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భూపతిపాలెం విద్యార్థులు

ప్రజాశక్తి- గోకవరం

భూపతిపాలెం ఎపిఆర్ఎస్ పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ బి.రవి తెలిపారు. కోనసీమ జిల్లా జి.వేమవరం జడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ ఆటల పోటీల్లో భాగంగా సోమవారం సాఫ్ట్ బల్ అండర్- 14లో బి.రిషికేశ, ఎం.సాత్విక్, అండర్- 17లో జి.సూర్య, ఎం.షణ్ముఖ శ్రీనివాసులు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. గెలుపొందిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పిఇటి సుధను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

పెరవలి : అన్నవరప్పాడులోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. తనిఖీదారు జి.సత్యవరప్రసాద్ పర్యవేక్షణలో లెక్కింపు జరుపగా 32 రోజులకు రూ.2,53,517, అన్నదాన హుండీ ద్వారా రూ.5,073 మొత్తంగా రూ.2,58,590 ఆదాయం సమకూరిందని సత్యవరప్రసాద్ తెలిపారు. ఈ లెక్కింపులో దేవస్థాన కార్యనిర్వహణ అధికారి ఎం.రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు

నేడు ఓటరు నమోదు

రాజమహేంద్రవరం రూరల్ : ధవళేశ్వరం ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఎల్‌సి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నాయకులు తెలిపారు. ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, ఒరిజినల్ డిగ్రీ లేదా డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ అటెస్టెడ్ కాపీలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటోను తీసుకొచ్చి ఓటరుగా నమోదు కావొచ్చన్నారు. వర్క్ షాప్ సబ్ డివిజన్ కార్యా లయం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రాడ్యుయేట్లు అందరూ దీన్ని వినియోగించుకోవాలని సూచించారు.